సాక్షి
రంగారెడ్డి
సోమవారం । 25 । సెప్టెంబర్ । 2023



ఎగుమతి చేసే స్థాయికి..

మత్స్యసంపద పెరిగిందని.. చేపలు ఎగుమతి చేసే స్థాయికి రాష్ట్రం ఎదిగిందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. 8లో▸



విషాదం నింపిన ప్రయాణం

కారు అదుపు తప్పి రోడ్డు పక్కన స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడింది. ప్రమాదంలో ఒకరు మృతి చెందగా పలువురు గాయపడ్డారు. 8లో▸



యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలో అక్రమ కట్టడాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పరిమితికి మించి నిర్మాణాలు చేపడుతున్నారు. 8లో▸

‘లైన్’లో పడేదెన్నడో?

వీకెండ్ వచ్చిందంటే చాలు బీజాపూర్ జాతీయ రహదారి వాహనాలతో రద్దీగా మారుతోంది. వేలాది వాహనాలు ఇరుకైన రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్నాయి. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఖరీదైన వాహనాలే కాదు విలువైన ప్రాణాలు కోల్పోవాల్సివస్తోంది. నిత్యం నెత్తురోడుతూ.. అనేక మంది ప్రాణాలను హరిస్తున్న ఈ రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించాలని ప్రభుత్వం భావించింది. ఈ మేరకు 2022 ఏప్రిల్ 29న కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ పనులకు శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ కిలో మీటర్ దూరం కూడా పనులు పూర్తి కాలేదు.



హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై వాహనాల రద్దీ

ఎన్‌హెచ్ 163కి కలగని మోక్షం

- నాలుగు లేన్లుగా విస్తరణకు శ్రీకారం
- శంకుస్థాపనతో సరి.. పనుల్లో తీవ్ర జాప్యం
- ఇప్పటికీ పూర్తికాని భూ సేకరణ.. కొనసాగుతున్న కోర్టు కేసులు
- ప్రయాణికుల పాట్లు.. తరచూ ప్రమాదాలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు 46 కిలోమీటర్ల పొడవున ఎన్‌హెచ్ 163 రోడ్డు విస్తరణ పనులు ఒక అడుగు ముందుకు.. మరో నాలుగు అడుగులు వెనక్కు అన్నట్లుగా సాగుతున్నాయి. రూ.928.41 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన పనులకు కేంద్ర మంత్రి గడ్కరీ శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టు కూడా ఖరారైంది. రోడ్డు విస్తరణలో భాగంగా 145.42 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉండగా, ఇప్పటికే 350 ఎకరాల మేర సేకరణ పూర్తయింది. నష్టపరిహారాన్ని బాధితుల పేరున బ్యాంకులో జమ చేసింది. ప్రభుత్వ, అసైన్డ్ భూముల సేకరణలో పెద్ద సమస్య లేదు కానీ..ప్రైవేటు పట్టా భూముల విషయంలోనే చిక్కంతా. కొంతమంది రైతులు నష్టపరిహారం చెల్లింపు విషయంలో కోర్టును ఆశ్రయించారు. దీంతో ఆయా పనులకు అంతరాయం ఏర్పడింది. 46 కిలోమీటర్లు చేపట్టనున్న ఈ విస్తరణ పనుల్లో భాగంగా 18 చోట్ల అండర్‌పాసులు నిర్మించాల్సి ఉంది. మొయినాబాద్ సమీపంలో 4.35 కిలోమీటర్లు, చేవెళ్ల సమీపంలో 6.36 కిలోమీటర్లు బైపాస్ రోడ్డును నిర్మించాల్సి ఉంది. ఇప్పటి వరకు ఏ ఒక్క చోట కూడా పనులు ప్రారంభించిన దాఖలాలు లేవు. అత్యంత వేగంగా పూర్తి కావాల్సిన పనులు ఆగుతూ..సాగుతుండటంతో సాధారణ ప్రయాణికులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. భూ సేకరణ, ఇతర అంశాల్లో తలెత్తిన అడ్డంకులను తొలగించి, పనుల్లో వేగం పెంచాల్సిన పాలకులు ఈ అంశాన్ని పట్టించుకోవడం లేదు.

ఉదాసీన వైఖరి

మొయినాబాద్ నుంచి చేవెళ్ల వెళ్లే మార్గంలో రోడ్డుకిరువైపులా పురాతన మర్రి చెట్లు ఉన్నాయి. వీటిని తొలగించే విషయమై బన్యన్‌ట్రీ సంస్థ జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. చెట్లను రీ లొకేట్ చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇప్పటి వరకు ఒక్క చెట్టును కూడా రీ లొకేట్ చేసింది లేదు. అధికారుల నిర్లక్ష్యం, పాలకుల ఉదాసీనతతో ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది. తక్షణమే రోడ్డు పనులు ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

వడివడిగా ఎన్‌హెచ్ 65 విస్తరణ పనులు

మరోవైపు ఎల్బీనగర్ నుంచి మల్కాపురం వరకు రూ.545 కోట్ల అంచనా వ్యయంతో 25 కిలోమీటర్ల మేర చేపట్టిన విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్65) పనులు వడివడిగా సాగుతున్నాయి.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు (ఫైల్)

ఇప్పటికే బాటసింగారం నుంచి పెద్ద అంబర్‌పేట్ వరకు 50 శాతం రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఉన్న నాలుగు లేన్లను ఆరు లేన్లుగా విస్తరిస్తున్నారు. స్థానికులకు రాకపోకలకు ఇబ్బంది కలగకుండా వనస్థలిపురం, సుష్మా, పనామా, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్, కోహెడ జంక్షన్, కవాడిపల్లి, అబ్దుల్లాపూర్‌మెట్, ఇనాంగూడ, బాటసింగారం ప్రాంతాల్లో అండర్ పాసులను ఏర్పాటు చేయనున్నారు. ఏకధాటి వర్షాలకు తోడు.. విస్తరణ పనులు చేపడుతుండటంతో రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. హయత్‌నగర్ నుంచి పెద్ద బాటసింగారం వరకు సమస్య తీవ్రంగా ఉంది. రోడ్డు పనుల నాణ్యత విషయంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పలుచోట్ల చేపట్టిన కాంక్రీట్ పనులు కూడా నాసిరకంగా ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎప్పటికప్పుడు ఈ పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

చిత్తశుద్ధి లేదు



హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ చేయాలనే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి లేనట్లు స్పష్టంగా కనిపిస్తోంది. పనులు చేయడంలో కాలయాపన చేస్తోంది. ఎంతోమంది ప్రాణాలు బలి తీసుకుంటున్న రోడ్డును విస్తరించాల్సింది పోయి మర్రి చెట్ల తొలగింపుపై కేసులు వేశారు అందుకే ఆలస్యం జరుగుతోందనే కుంటిసాకులు చెబుతోంది.

– చింపుల సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ చైర్మన్

ముందుకు సాగడం లేదు



రహదారి విస్తరణకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. భూసేకరణ రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సి ఉండగా.. పూర్తి స్థాయిలో చేపట్టలేదు. రైతులకు నష్టపరిహారం ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తోంది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న మర్రిచెట్ల తొలగించడంలో జాప్యం చేస్తోంది. రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగడంలేదు.

– ఎల్గని వెంకటేశ్‌గౌడ్, ఓబీసీ మోర్చా చేవెళ్ల నియోజకవర్గం కన్వీనర్

ప్రాణాలు పోతున్నా పట్టదా..?



హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ ఏడాది క్రితం మొదలు పెట్టారు. ప్రస్తుతం పనులు జరగడంలేదు. రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎంతో మంది ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం స్పందించడంలేదు. నిధులు మంజూరైనా పనులు చేపట్టడంలేదు. ఇంకా ఎంత మంది ప్రాణాలు పోతే ప్రభుత్వం స్పందిస్తుందో అర్థం కావడంలేదు.

– కేబుల్ రాజు, మొయినాబాద్

రైల్వే రంగం అభివృద్ధి ఘనత బీజేపీదే..



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి

పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

షాద్‌నగర్‌రూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో రైల్వే రంగం మరింత అభివృద్ధిని సాధించిందని పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి అన్నారు. వందేభారత్ రైలును ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చ్యువల్‌గా ప్రారంభించిన సందర్భంగా ఆదివారం షాద్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఆ పార్టీ నాయకులు, రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో బొక్కా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. దేశంలోని అన్ని ప్రాంతాలకు రైల్వే ప్రయాణికులను అతి వేగంగా గమ్య స్థానాలకు చేరవేసే విధంగా సూపర్ ఫాస్ట్ రైళ్లను ఏర్పాటు చేసిన ఘనత కేంద్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రైల్వే ప్రయాణికులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలను అందించాలనే ఉద్దేశంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ వందే భారత్ రైళ్లను ప్రారంభించారని అన్నారు. ప్రయాణికులు రైల్వే సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, పార్టీ అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ విజయకుమార్, జాతీయ కార్యవర్గ సభ్యుడు పాపయ్యగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చెంది మహేందర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, రైల్వే బోర్డు సభ్యులు దిడ్డిగోపాల్, చంద్రశేఖర్, రైల్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

16 గంటలు..70 శంకుస్థాపనలు



స్థానికులతో ఆప్యాయంగా కరచాలనం చేస్తున్న మంత్రి సబితారెడ్డి

- ఒక వైపు శంకుస్థాపనలు
- మరోవైపు గణపతి పూజలు
- రోజంతా మంత్రి సబితారెడ్డి బిజీ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 16 గంటలు.. 70 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలతోపాటు గణపతి పూజలతో మంత్రి సబితారెడ్డి రోజంతా బిజీగా గడిపారు. ఆదివారం ఉదయం ఆరు గంటలకే ఇంటి నుంచి మహేశ్వరం నియోజకవర్గానికి చేరుకున్న ఆమె.. ఒకేరోజు రూ.18 కోట్ల విలువ చేసే 70 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి రాజకీయాల్లో సరికొత్త రికార్డు సృష్టించారు. ఇటీవల సీఎం కేసీఆర్ బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లకు రూ.100 కోట్ల నిధులు కేటాయించిన విషయం తెలిసిందే. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా లైన్లు, ఇతర అభివృద్ధి పనులకు ఈ నిధులు ఖర్చు చేస్తున్నారు. పదిహేను రోజుల క్రితం ఒకేరోజు 65 అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, రికార్డు నెలకొల్పిన మంత్రి.. తాజాగా తన రికార్డును తానే తిరగరాస్తూ..రాజకీయాల్లో సరికొత్త చరిత్ర సృష్టించారు. ఒకవైపు భగ్గున మండుతున్న ఎండను, సాయంత్రం కురిసిన చిరు జల్లులను లెక్క చేయకుండా రోజంతా ప్రజల మధ్యే గడిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, సాధారణ ప్రజలతో మమేకమయ్యారు. వారి సమస్యలను ఆలకిస్తూ అప్పటికప్పుడు వాటికి పరిష్కారమార్గం చూపించారు.

న్యూస్‌రీల్

విశ్వశాంతి కోసం ఆయుత చండీయాగం



భూమిపూజ చేస్తున్న స్వామీజీ

షాద్‌నగర్: విశ్వశాంతి కోసం నిర్వహించే ఆయుత చండీ యాగంలో అందరు పాల్గొనాలని కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామి కోరారు. షాద్‌నగర్ పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్డులో అక్టోబర్ 26 నుండి నవంబర్ 8వ తేదీ వరకు నిర్వహించే ఆయుత చండీ అతిరుద్ర యాగానికి సంబంధించి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ.. ప్రజలు సుభిక్షంగా, ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలనే సంకల్పంతో ఈ యాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశ్వశాంతి కోసం అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, డాక్టర్ మర్రి కృష్ణారెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, పలబట్ల మోహన్‌రావు, శ్రీశైలంగౌడ్, మురళి, రుషికేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన యోగాసన పోటీలు



విజేతలతో నిర్వాహకులు, అతిథులు

కడ్తాల్: సంస్కారవంతమైన సమాజ నిర్మాణానికి, శక్తివంతమైన దేశ నిర్మాణం కోసం యోగా సాధన దోహద పడుతుందని యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రావు అన్నారు. మండల కేంద్రం సమీపంలోని మహేశ్వర మహాపిరమిడ్ ధ్యాన కేంద్రంలో తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా కొనసాగుతున్న పోటీలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు శ్రీధర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణతో సాధన చేస్తే ఏదైనా సాధించవచ్చని అన్నారు. రానున్న రోజుల్లో యోగాను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లనున్నట్టు చెప్పారు. యోగాసన భారత్ నేషనల్ జాయింట్ సెక్రటరీ నందనం కృపాకర్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయి యోగాసన పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు త్వరలోనే ప్రత్యేక శిక్షణ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్టీ సాంబశివరావు, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీలు రాంరెడ్డి, సతీష్, వైస్ ప్రెసిడెంట్ రాంచందర్, విశాల్ ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీఓ 111 రద్దుతో దుష్పరిణామాలు



పీపుల్స్ సైంటిఫిక్ కమిటీ రిపోర్టును ఆవిష్కరిస్తున్న పర్యావరణవేత్తలు

పంజగుట్ట: జీఓ 111 రద్దు చేయడం వల్ల ఎన్నో దుష్పరిణామాలు ఉంటాయని పలువురు వక్తలు, పర్యావరణవేత్తలు అన్నారు. ‘జీఓ 111 రద్దుతో కలిగే పరిణామాలు, పర్యావరణానికి కలుగుతున్న విఘాతం.. వివిధ దేశాల్లో జరిగిన పరిణామాలు, రైతుల పరిస్థితి, వాతావరణంలో ఎలాంటి మార్పులు వస్తాయి? అనే అంశంపై లాంగ్‌లైవ్ లేక్స్ క్యాంపెయిన్ హైదరాబాద్, తెలంగాణ ప్రతినిధి లుబ్నా సర్వత్ ఆధ్వర్యంలో పర్యావరణ వేత్తలు డాక్టర్ కె.బాబురావు, సాగర్ ధారా, డాక్టర్ బి.రామలింగేశ్వర్ రావులు రూపొందించిన 129 పేజీల పీపుల్స్ సైంటిఫిక్ కమిటీస్ రిపోర్టును ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. నగరం మరో 530 చదరపు కిలోమీటర్లు విస్తరించవచ్చని.. అభివృద్ధిలో భాగమవుతుందని జీఓ 111 రద్దు చేశారు. కానీ.. జంట జలాశయాలు లేకపోతే జరిగే పరిణామాలపై ఆలోచించడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. నగరం ఇప్పటికే కోటి మందితో పెద్ద నగరంగా ఉందని, మరింత పెద్దగా పట్టణీకరణ జరిగితే మంచిది కాదన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ... ప్రకృతి సమతుల్యం లేకపోవడమే అన్ని వ్యాధులకు కారణమన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పది



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని, భావి భారత పౌరులను తీర్చిదిద్దే గురుతర బాధ్యత వారిపైనే ఉందని మూసీ రివర్ బోర్డు చైర్మన్, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. జిల్లా గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో కర్మన్‌ఘాట్‌లోని వంగా శంకరమ్మ గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానోత్సవానికి ఎమ్మెల్సీలు కసిరెడ్డి నారాయణరెడ్డి, ఏవీఎన్ రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశ అభివృద్ధిలో విద్యా వ్యవస్థ పాత్ర ఎంతో గొప్పదని, బడ్జెట్ పాఠశాలల న్యాయమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం బడ్జెట్ పాఠశాలలకు ఆస్తి పన్ను, విద్యుత్ బిల్లుల్లో రాయితీ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు పాపిరెడ్డి, కార్యదర్శి ఎస్.ఎన్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుప్పకూలిన స్లాబ్

- ఇద్దరు కార్మికుల దుర్మరణం
- మరో నలుగురికి గాయాలు



కూలిన భవనం పైకప్పు

పహాడీషరీఫ్: కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కార్మికుల ప్రాణాల మీదకు తెస్తోంది. నగరంలో ఇటీవల జరిగిన రెండు ఘటనల్లో కార్మికులు మృతి చెందిన చేదు జ్ఞాపకాలు మరువక ముందే.. నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలివ్వడంతో తాజాగా ఆదివారం పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మామిడిపల్లిలో ఇద్దరు కార్మికులు బలయ్యారు. ఇన్‌స్పెక్టర్ సతీష్, స్థానికుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు సంజీవ్ ముదిరాజ్ బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మామిడిపల్లి శివారులో ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఇందుకు సంబంధించి నాగరాజు అనే వ్యక్తికి కాంట్రాక్ట్ అప్పగించాడు. మొదటి అంతస్తు పూర్తికాగా.. రెండో అంతస్తు స్లాబ్ పనులను ఆదివారం చేపట్టారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన జగదీష్ బీడికర్ (49), ఉత్తరప్రదేశ్‌కు చెందిన కాంక్రీట్ మిషన్ వర్కర్ తిలక్ సింగ్ (33), శ్రీకాంత్, దినేష్, ఉపేందర్, ఆంజనేయులుతో పాటు మరో పది మందిని హయత్‌నగర్‌లోని భవన నిర్మాణ రంగ కార్మికుల అడ్డాపై నుంచి తీసుకొచ్చారు. స్లాబ్ వేస్తున్న క్రమంలో మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఒక్కసారిగా కూలడంతో జగదీష్, తిలక్‌సింగ్ అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడ్డ మరో నలుగురిని చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కాగా ఈ నిర్మాణానికి సంబంధించి అనుమతులు లేనట్లు తెలిసింది. నాణ్యతా ప్రమాణాలు పాటించని కారణంగా ఈ ప్రమాదం జరిగిందని అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ సతీష్ తెలిపారు.



తిలక్ సింగ్ మృతదేహం



జగదీష్ బీడికర్ (ఫైల్)

అందాల వంతెనలు



- మూసీ, ఈసా నదులపై ఫోర్‌లేన్ బ్రిడ్జీలు
- రూ.168 కోట్లతో నిర్మించనున్న హెచ్‌ఎండీఏ
- నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి కేటీఆర్

సాక్షి, సిటీబ్యూరో: చారిత్రక మూసీ, ఈసా నదులపై అందమైన వంతెనలు అందుబాటులోకి రానున్నాయి. నగరానికి ఉత్తర, దక్షిణ మార్గాల్లో రాకపోకలకు అనుగుణంగా సరికొత్త డిజైన్లలో బ్రిడ్జీలను నిర్మించేందుకు హెచ్‌ఎండీఏ చర్యలు చేపట్టింది. ఔటర్ లోపల పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా ప్రజల మౌలిక అవసరాలకు సరిపడా ప్రజా రవాణా వ్యవస్థలో పెద్దఎత్తున మార్పులు చేపట్టారు. అందులో భాగంగానే మూసీ, ఈసా నదులపై వంతెనల నిర్మాణాన్ని చేపట్టింది. ఈ రెండు నదులపై వివిధ చోట్ల 14 బ్రిడ్జీలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో ప్రస్తుతం హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో మూసీ నదిపై 3 చోట్ల, ఈసా నదిపై 2 చోట్ల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. సుమారు రూ.168 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ వంతెనల నిర్మాణ పనులకు హెచ్‌ఎండీఏ ఇప్పటికే ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) పద్ధతిలో టెండర్ల ప్రక్రియను పూర్తి చేసింది. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ బ్రిడ్జీల నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేయనున్నారు.

హెచ్‌ఎండీఏ నిర్మించనున్న బ్రిడ్జీలు..

సుమారు రూ.42 కోట్లతో ఉప్పల్ భగాయత్ లేఅవుట్ వద్ద ఒక బ్రిడ్జి నిర్మించనున్నారు. మరో రూ.35 కోట్లతో ప్రతాపసింగారం- గౌరెల్లి వద్ద నిర్మిస్తారు. మంచిరేవుల వద్ద రూ.39 కోట్ల వ్యయంతో, బుద్వేల్ ఐటీపార్కు-2 వద్ద ఈసా నదిపై రూ.32 కోట్లతో నిర్మించనున్నారు. రూ.20 కోట్లతో బుద్వేల్ ఐటీ పార్క్-1 సమీపంలో ఈసా నదిపై హెచ్‌ఎండీఏ వంతెనల నిర్మాణాలను చేపట్టనుంది. 15 నెలల్లో ఈ బ్రిడ్జీల నిర్మాణాన్ని పూర్తి చేయాలని హెచ్‌ఎండీఏ లక్ష్యంగా పెట్టుకుంది.

అభివృద్ధిని చూసే చేరికలు



యాచారం: ఎమ్మెల్యే మంచిరెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న చింతపట్ల గ్రామస్తులు

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- మూడోసారి మాదే అధికారం: కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

యాచారం: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలు అధికారంలోకి వచ్చేదీ లేదు.. ఆ పార్టీలతో ప్రజలకు ఒరిగేదేమీ లేదని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చింతపట్ల గ్రామానికి చెందిన సీపీఎం, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 50 మంది ఎమ్మెల్యే సమక్షంలో గులాబీ గూటికి చేరారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజానీకం మూడోసారి బీఆర్‌ఎస్‌కే పట్టం కట్టేందుకు సిద్ధమయ్యారని.. కాంగ్రెస్, బీజేపీలను ఎట్టి పరిస్థితుల్లో నమ్మరన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని చూసే ప్రజలు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతునన్నారన్నారు. వెనుకబడిన గ్రామాలను గుర్తించి అధిక నిధులు కేటాయిస్తామన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఆయన కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బండి యాదయ్య, అశోక్, సత్యనారాయణ, సలీం, బషీర్, రవీందర్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేశ్‌గౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు లిక్కి నర్సింహారెడ్డి, నాయకులు లిక్కి గోవర్ధన్‌రెడ్డి, సింగారం వెంకటయ్య, చంద్రయ్య, మధూకర్‌రెడ్డి, జగన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

తుర్కయంజాల్: మున్సిపాలిటీ పరిధిలోని తుర్కయంజాల్ 10వ వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన శోభానగర్‌లో ప్రతిష్ఠించిన గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాలనీవాసులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. తాగునీటి, యూజీడీ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు విన్నవించారు. ఆయన వెంట డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, మాజీ సర్పంచ్‌లు లక్ష్మారెడ్డి, దశరథ, కౌన్సిలర్ రవీందర్ రెడ్డి, నాయకులు విజయానంద రెడ్డి, శేఖర్‌గౌడ్, గౌతమ్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి, కాలనీ వాసులు సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

ఆమనగల్లు: రాష్ట్ర ప్రజల అండతో బీఆర్‌ఎస్ మూడవసారి అధికారంలోకి రావడం ఖాయమని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజాసంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను చూసి వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఆయన చెప్పారు. ఆదివారం నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో మాలెపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందుతున్నాయని ప్రజా మద్దతుతో మరో మారు అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రతిపక్ష పార్టీలు పగటి కలలు కంటున్నాయని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, నాయకులు సయ్యద్ ఖలీల్, కోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



కృష్ణయ్య మృతదేహం

ఆమనగల్లు: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని మంగళపల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు ఎడ్ల కృష్ణయ్య(56)కు మంచాల గుట్ట వద్ద మూడున్నర ఎకరాల పొలం ఉంది. రోజు మాదిరిగానే ఆదివారం ఉదయం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. బోర్ మోటార్ ఆన్ చేస్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమీప పొలాల రైతులు గమనించి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుమారుడు యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బలరాం తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి



బైక్ ఢీకొట్టడంతో విరిగిన దిమ్మె

యాచారం: బైక్ అదుపుతప్పి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన ప్రకారం.. మాడ్గుల మండలం నార్సయిపల్లికి చెందిన తోలు కృష్ణయ్య(28) ఆదివారం యాచారం ప్రభుత్వాస్పత్రికి వస్తున్నాడు. మాల్-తమ్మలోనిగూడ గేట్ మార్గంలో బైక్ అదుపుతప్పడంతో రోడ్డు పక్కనున్న ఈజీఎస్ దిమ్మెను అతివేగంగా ఢీకొట్టాడు. దీంతో ఆయన తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు యాచారం సీఐ సైదయ్య తెలిపారు.

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. జీప్లస్ టుకు అనుమతులు తీసుకుని సెల్లార్లు తవ్వి ఏకంగా ఐదు, ఆరు అంతస్తుల్లో భవన నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంతో ప్రజలు విమర్శిస్తున్నారు.

- రెండతస్తులకు అనుమతులు బహుళ అంతస్తుల్లో భవనాలు
- నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ల నిర్మాణం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



హైదరాబాద్ రోడ్డులో నిర్మిస్తున్న ఓ భవనం

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలో అక్రమ కట్టడాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా పరిమితికి మించి అంతస్తుల్లో భవన నిర్మాణాలు చేపడుతున్నారు. ఓ వైపు అక్రమనిర్మాణాలపై ఉన్నతాధికారులు కొరడా ఝులిపిస్తుంటే మున్సిపల్ అధికారుల తీరుతో ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

మున్సిపల్ ఆదాయానికి గండి

పట్టణ కేంద్రంలోని హైదరాబాద్, సంగారెడ్డి రోడ్డు, పత్తేపురం రోడ్డులో గజానికి రూ.లక్ష పైగా ఉంది. దీంతో అక్కడ స్థలాలున్న యజమానులు బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. సంబంధిత అధికారులు ముడుపులు ముట్టజెప్పడంతో పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ పరిధిలో జీప్లస్ టూ వరకే అనుమతులు ఇచ్చే అధికారం ఉంటుంది. అంతకు మించి అంతస్తులు నిర్మించాలంటే హెచ్‌ఎండీఏ అనుమతులు తప్పనిసరి. కానీ కొందరు యజమానులు సెల్లార్లు తవ్వి మూడు నుంచి ఆరు అంతస్తుల వరకు నిర్మించి టూలెట్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. బహుల అంతస్తులు నిర్మించిన యజమానులు సెల్లార్లలోనూ వ్యాపార కార్యకలపాలు నిర్వహించుకునేందుకు అద్దెకు ఇస్తున్నారు. ఇందుకు మున్సిపాలిటీ ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. వారు మాత్రం సెల్లార్‌ను పార్కింగ్‌గా చూపుతూ మున్సిపల్ ఆదాయానికి గండికొడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి కోరుతున్నారు.

గొల్లవాగు కబ్జా

మున్సిపల్ పరిధిలోని గొల్లవాగు కబ్జాకు గురవుతోంది. ఇటీవల ఓ వెంచర్ యాజమాన్యం క్లబ్ హౌజ్ నిర్మాణం చేపట్టింది. కొందరు నాయకులు వాగులోకి వరద రాకుండా మట్టిని నింపి కబ్జాకు తెరలేపారని పలువురు చర్చించుకుంటున్నారు. గొల్లవాగు సర్వే చేపట్టి హద్దులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్లపైనే పార్కింగ్

మున్సిపల్ పరిధిలో ప్రైవేట్ ఆస్పత్రులు, బ్యాంకులు, షాపింగ్‌మాల్స్ వెలిశాయి. ఈ భవనాల్లోని సెల్లార్లలోనూ వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో వాహనాలను రోడ్లపైనే పార్క్ చేస్తున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రమాదాలు పెరిగిపోతున్నాయి.



పత్తేపురం తీగల వాగు పక్కన సెల్లార్‌తో నిర్మిస్తున్న భవనం

చర్యలు తీసుకుంటాం

మున్సిపల్ పరిధిలో సెల్లార్ల నిర్మాణానికి అనుమతులు లేవు. ఎవరైనా ఏర్పాటు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అక్రమంగా సెల్లార్‌లను ఏర్పాటు చేసి అద్దెకు ఇచ్చిన వారిని గుర్తించి నోటీసులు అందిస్తాం. పరిమితి మించి అంతస్తుల్లో భవనాలు నిర్మిస్తే కూల్చేస్తాం.

– జ్ఞానేశ్వర్, మున్సిపల్ కమిషనర్, శంకర్‌పల్లి

రోడ్డు ఆక్రమణదారులపై కేసు నమోదు

శంషాబాద్: రోడ్డును కబ్జా చేయడమే కాకుండా దానిని పరిష్కరించేందుకు వచ్చిన వారిపై దాడికి యత్నించిన వారిపై శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. చిన్న గోల్కొండ సయ్యద్‌గూడ సర్వేనంబర్ 26బై6 లో దండేమూడి బయోటెక్ కంపెనీ యజమాన్యం ఆరుఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసింది. భూములు విక్రయించిన ఎయిర్‌పోర్టు కాలనీకి చెందిన జనిగే గోపాల్, సిద్దులు, పర్వతాలు తదితరులు అక్కడే గులాబీ తోటను సాగు చేస్తున్నారు. ఈ విషయమై యజమాన్యం గతంలో అడ్డుకోగా బతుకుదెరువు కోసం చేస్తున్నామని చెప్పుకొచ్చారు. సదరు భూమి వెనక గతంలో ప్రభుత్వం వడ్డెర కులస్తులకు ఇళ్లు నిర్మించి ఇందులోంచి రోడ్డు ఏర్పాటు చేసింది. గొల్లపల్లి సర్వేనంబరు 261లో ఉన్న ప్రభుత్వ భూమికి కూడా ఇందులోంచే రోడ్డు ఉండగా ఇటీవల పేదలకు ఇళ్ల పట్టాల విషయమై కౌన్సిలర్ చెన్నం అశోక్ తదితరులు అక్కడికి వెళ్లగా జనిగే గోపాల్, పర్వతాలు, వెంకటేస్, సిద్దులు తదితరులు వారిపై దాడులకు పాల్పడ్డారు. దండెమూడి బయోటెక్ ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా సెక్యూరిటీగార్డు మృతి

రెండు రోజుల క్రితమే అదృశ్యం కేసు

ఇబ్రహీంపట్నం రూరల్: ఓ వెంచర్‌లో సెక్యూరిటీగార్డు అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ ఘటప ఆదిబట్ల పీఎస్ పరిధిలో ఆదివారం వెలుగుచూసింది. ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపిన ప్రకారం.. కొంగరకుర్దు రెవెన్యూ పరిధిలోని ఓ వెంచర్‌లో అస్సాంకు చెందిన రాకేశ్ బోరా(24) ఆరు నెలలుగా సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నాడు. ఆయన కనిపించడం లేదని తండ్రి ఈ నెల 22న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే వెంచర్‌లో రోడ్డు పనిచేస్తున్న కార్మికులు మృతదేహాన్ని గుర్తించి యాజమాన్యానికి తెలిపారు. విషయం తెలసుకున్న పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించగా మృతుడి ప్యాంటు జిప్పు తీసి ఉంది. మృతదేహం పక్కనే విద్యుత్ వైర్లు తెగిపడి ఉన్నాయి. మృతదేహం దుర్వాసన వస్తుండడంతో రెండు రోజుల క్రితమే మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురికీ తరలించినట్లు పోలీసులు తెలిపారు. కాగా సెక్యూరిటీ గార్డు మృతిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

భక్తిరంజకంగా భజన కీర్తనల పోటీలు



భజన కీర్తనలు పాడుతున్న చిన్నారులు

శంషాబాద్: పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఆదివారం భజనకీర్తనల పోటీలు భక్తిరంజకంగా సాగాయి.. విశ్వహిందు పరిషత్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, ధర్మజాగరణ్ సౌజన్యంతో భజనభారి శంషాబాద్ శాఖ ఏర్పాటు చేసిన పోటీల్లో శంషాబాద్, పద్మశాలిపురం, లక్ష్మీగూడ భజన బృందాల తరపున చిన్నారులు భజన సంకీర్తనలను ఆలపించారు. తుది పోటీలు ఈ నెల 27 నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ–కేవైసీ తిప్పలు!

- రేషన్ షాపుల ముందు క్యూ..
- ప్రక్రియ కొనసాగుతుందంటున్న అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: ఆహార భద్రత (రేషన్) కార్డు ఈ-కేవైసీ పునరుద్ధరణకు తిప్పలు తప్పడం లేదు. గత పదిరోజులుగా ప్రభుత్వ చౌకధరల దుకాణాల ముందు లబ్ధిదారులు బారులు తీరుతున్నారు. ఆదివారంతో నెలసరి రేషన్ కోటా పంపిణీ గడువు ముగిసినప్పటికి దుకాణాలను తెరిచి ఉంచి ఈ-కేవైసీ పునరుద్ధరించే ప్రక్రియ కొనసాగించాలని పౌరసరఫరాల శాఖ అధికారులు డీలర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ-కేవైసీ పునరుద్ధరణ తప్పనిసరి చేయడంతో లబ్ధిదారులు రేషన్ షాపులకు పరుగులు తీస్తున్నారు. లబ్ధిదారులందరూ రేషన్ షాపులకు వెళ్లి బయోమెట్రిక్ పెట్టక తప్పడం లేదు. దీంతో ఈ-పాస్‌కు తాకిడి పెరగడంతో సెంట్రల్ సర్వర్‌పై భారంపడి చీటికి మాటికి ట్రబుల్ ఇస్తోంది. ఈ-పాస్ సర్వర్ స్లో కావడంతో పాటు మాటిమాటికి మొరాయిస్తోంది. ఒక్కో యూనిట్ ఈ-కేవైసీ పునరుద్ధరణకు 10 నుంచి 15 నిమిషాల సమయం పడుతోంది. ఒక్కో కుటుంబంలోని సభ్యులు రెండు మూడు పర్యాయాలు రేషన్ షాపులకు చక్కర్లు చేయాల్సి వస్తోంది. మరోవైపు గత ఐదేళ్లలో బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకొని యూనిట్ల ఈ-కేవైసీ కూడా పెండింగ్‌లో పడిపోతోంది.

ఇనాక్టివ్ యూనిట్ల గుర్తింపు

రేషన్ ఈ-కేవైసీ పునరుద్ధరణ ద్వారా అందుబాటులో లేని, మృతి చెందిన యూనిట్ల గుర్తింపు ప్రక్రియ ప్రారంభమైంది. ఒక్కో షాపు పరిధిలో వందలాది యూనిట్లు అందుబాటులో లేనట్లు తెలుస్తోంది. వాస్తవంగా ప్రజాపంపిణీ వ్యవస్థలో ఈ-పాస్ ప్రక్రియ తర్వాత ఇప్పటి వరకు కేవైసీ పునరుద్ధరణ జరుగలేదు. మొత్తం మీద గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే అందుబాటులో లేని యూనిట్లు సుమారు మూడు లక్షల వరకు ఉండవచ్చని పౌరసరఫరాల అధికారులు అనుమానిస్తున్నారు. అందులో మృతి చెందిన యూనిట్లు (లబ్ధిదారులు) లక్షపైనే ఉండగా, ఇప్పటి వరకు 50 వేల 195 యూనిట్లను గుర్తించినట్లు తెలుస్తోంది. మరోవైపు అందుబాటులో లేని యూనిట్లు రెండు లక్ష వరకు ఉండగా, అందులో సైతం 50 శాతం గుర్తించనిట్లు అధికారుల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

కేవైసీ పునరుద్ధరణ ఇలా..

రేషన్ కార్డులోని యూనిట్లు (సభ్యులందరూ)చౌకధరల దుకాణానికి వెళ్లి ఈ-పాస్ యంత్రంలో వేలిముద్రలు పెట్టాల్సి ఉంటుంది. వేలిముద్ర వేయగానే రేషన్ కార్డు నంబరుతోపాటు అతని ఆధార్ కార్డు నంబరు చూపిస్తుంది. ఈ ప్రక్రియ ద్వారా ఆకుపచ్చ వెలుగు వచ్చి సదరు వినియోగదారుని కేవైసీ పునరుద్ధరించబడుతుంది. ఒకవేళ కేవైసీ పునరుద్ధరణలో ఈ-పాస్ యంత్రంలో రెడ్ వెలుగు వస్తే సదరు వినియోగదారుని రేషన్ కార్డు..ఆధార్ నెంబర్‌తో సరిపోల్చలేదంటూ తిరస్కరణ సూచిస్తుంది. ఆ తర్వాత రేషన్‌కార్డులోని ఆ యూనిట్ ఏరివేతకు గురవుతుంది.

ఎగుమతి చేసే స్థాయికి ఎదిగాం

చేప పిల్లల పంపిణీలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



మొయినాబాద్: చిలుకూరు పెద్ద చెరువులో చేప పిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే యాదయ్య

మొయినాబాద్/శంకర్‌పల్లి: రాష్ట్రంలో మత్స్యసంపద పెరిగిందని.. చేపలు ఎగుమతి చేసే స్థాయికి రాష్ట్రం ఎదిగిందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని చిలుకూరు పెద్ద చెరువులో, శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని బుల్కాపురం, మండల పరిధిలోని ప్రొద్దుటూరు పెద్ద చెరువులో ఆదివారం చేపపిల్లలు వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు చెరువులు ఎడారిని తలపించేవని.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ చెరువులకు జలకళ తీసుకొచ్చారన్నారు. చెరువుల్లో ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలు వదిలి మత్స్యకారులకు ఉపాధి పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీకాంత్, సర్పంచ్ స్వరూప, వార్డు సభ్యుడు వెంకటేశ్, మాజీ ఉపసర్పంచ్ ఆండ్రూ, ఏఎంసీ డైరెక్టర్లు మహేశ్‌యాదవ్, భిక్షపతి, నాయకులు జయవంత్, నర్సింహగౌడ్, పరమేశ్, ముజ్జు, చెన్నయ్యయాదవ్, రాంరెడ్డి, జకరయ్య, శంకర్‌పల్లి ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు గోవిందమ్మ, ప్రొద్దటూరు సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బొల్లారం ప్రవళిక, ఏఎంసీ చైర్మన్ పాపారావు, పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్, మున్సిపల్ అధ్యక్షుడు వాసుదేవ్‌కన్నా, కౌన్సిలర్లు జూలకంటి లక్ష్మమ్మ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విషాదాన్ని మిగిల్చిన ప్రయాణం



ప్రమాదానికి గురైన కారు

కారు బోల్తా.. ఒకరి మృతి

- పలువురికి గాయాలు



నితిన్ (ఫైల్)

చేవెళ్ల: కుటుంబ సభ్యులంతా ఆదివారం సరదాగా గడపాలని అనుకున్నారు. ఓ ఫాంహౌస్‌లో గెట్ టు గెదర్ పార్టీ ఉండడంతో కారులో బయలుదేరారు. ఈ ప్రయాణం కాస్త విషాదంగా మారింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన హైతా యుగేందర్ హైదరాబాద్‌లో నివసిస్తున్నాడు. చేవెళ్ల సమీపంలోని ఓ ఫాంహౌస్‌లో ఆత్మీయ సమ్మేళనం ఉండడంతో కుటుంబ సభ్యులతో ప్రయాణమయ్యారు. యుగేందర్ కుమారుడు నితిన్(27) కారు డ్రైవ్ చేస్తున్నాడు. చేవెళ్ల మండల కేంద్రానికి సమీపంలో వీరి కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నితిన్ తలకు బలమైన గాయమవ్వడంతో కారులో ప్రయాణిస్తున్న వారి కుటుంబ సభ్యులకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు నితిన్ అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. చేతికి వచ్చిన కొడుకు వ్యాపారం చేస్తూ కుటుంబానికి అండగా నిలబడ్డాడు. ఈ ఘటన వారి కుటుంబంలో విషాదాన్ని నింపింది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే పరీక్ష రద్దు

శంషాబాద్: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం కారణంగానే మరోసారి గ్రూప్స్ ప్రిలిమ్స్ పరీక్షక్ష రద్దయిందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ చాకలి మహేష్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో ఉద్యోగ పరీక్షల దగ్గరి నుంచి సాధారణ పరీక్షల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందన్నారు. పేపర్ లీకేజీలు, వాటిని అమ్ముకోవడం సర్వసాధారణమయ్యాయన్నారు. ప్రభుత్వం వెంటనే టీఎస్‌పీఎస్సీ రద్దు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.